వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
గురువారం 19 సెప్టెంబర్ 2024

## రుషివ్యాలీ టీచరే ఢిల్లీ ముఖ్యమంత్రి

**కురబలకోట, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త :**



ఢిల్లీ నూతన ముఖ్యమంత్రిగా పదవీబాధ్యతలు స్వీకరించిన అతిశీ రాష్ట్ర, దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈమె రాష్ట్రంలోని ఉమ్మడి చిత్తూరుజిల్లా మదనపల్లెకు సమీపంలోని ప్రముఖ విద్యాకేంద్రమైన రుషివ్యాలీలో ఉపాధ్యాయురాలిగా 2003-2004 పనిచేశారు. రుషివ్యాలీలో ఆమె ఇంగ్లీష్‌హిస్టరీ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ విద్యావిదానంలో నూతన ఆవిష్కరణకు కృషి చేశారు. అనంతరం ఆమె ఆమ్ ఆద్మీ పార్టీలో 2013లో చేరారు. ఢిల్లీ విద్యాశాఖా మాజీ మంత్రి మని సిసోడియాకు సలహదారులుగా వ్యవహరించారు. అనంతరం ఎమ్మెల్యేగా గెలిచి పార్టీలో కీలకనేతగా ఎదిగారు. ఢిల్లీ ముఖ్యమంత్రి క్రేజీవాల్ రాజీనామా చేయడంతో ఈమెను ఢిల్లీ సిఎంగా ఆ పార్టీ అధిష్టానం ఏకగ్రీవంగా ఎన్నుకొంది. రుషివ్యాలీతో ఉన్న అనుబంధాన్ని ఇక్కడి తోటి ఉపాధ్యాయులు, రుషివ్యాలీ సిబ్బంది సంబరాలు జరుపుకొన్నారు. ఈ మె దేశ రాజధాని ఢిల్లీ సిఎంగా బాధ్యతలు చేపట్టడంతో మంచి సుపరిపరిపాలన అందిస్తారని రుషివ్యాలీ స్కూల్ సిబ్బంది ఆశాభావం వ్యక్తపరిచారు.



రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పాల్గొన్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

## రూ.24లక్షల చెక్కును సీఎంకు అందజేసిన మంత్రి



**రాయచోటి, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:**

వరద బాధితుల సహాయం కోసం సీఎం సహాయ నిధికి రూ.24లక్షల చెక్కును ఏపీ రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏపీ హైర్ బస్సు ఓనర్ అసోసియేషన్ సభ్యులు సీఎం నారా చంద్రబాబునాయుడకు అందజేశారు. బుధవారం అమరావతిలో ఏపీ సీఎంను కలిసి విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఏపీ రాష్ట్ర హైర్ బస్సు ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు రూ.24లక్షల చెక్కును మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎంకు అందజేశారు. వరద బాధితులకు సహాయం కోసం మరింత మంది ముందుకొచ్చి సహాయం చేయాలని సీఎం పిలుపునిచ్చారు.

## మిడ్ డే మీల్స్ ఆకస్మిక తనిఖీ చేసిన డీపీవో



**సిద్దవటం, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:**

సిద్దవటం మండలం టక్కోలి జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం మధ్యాహ్నం జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి విద్యార్థినీ విద్యార్థులకు అందిస్తున్న మిడ్ డే మీల్స్ ఆకస్మిక తనిఖీ చేశారు. నాణ్యతా లోపం లేకుండా చూడాలని హెడ్మాస్టర్‌కు సూచించారు. మెనూ ప్రకారం అందించాలని ఆదేశించారు. మిడ్ డే మీల్స్ నాణ్యతా లోపం లేకుండా చూడాలన్నారు.

# తహసీల్దారుపై దాడికియత్నం

**- తహసీల్దారు ఫిర్యాదు మేరకు కేసు నమోదు- సిద్దవటం ఎస్సై చిరంజీవి**

**సిద్దవటం, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:**

తహసీల్దారుపై మాచుపల్లి గ్రామానికి చెందిన మల్లు వెంకట సుబ్బారెడ్డి అనే వ్యక్తి దాడికి యత్నించడంతో బుధవారం అతనిపై కేసు నమోదు చేసినట్లు సిద్దవటం ఎస్సై చిరంజీవి తెలిపారు. ఎస్సై కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మాచుపల్లి గ్రామ సర్వే నెంబరు 99,100లో భూమి కబ్జాకు గురైందని మాచుపల్లి గ్రామానికి చెందిన మల్లు వెంకట సుబ్బారెడ్డి కలెక్టరుకు ఫిర్యాదు చేశాడన్నారు. కబ్జాకు గురైన భూమిని పరిశీలించేందుకు తహసీల్దారు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వీఆర్వో, సర్వేయర్లు ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్‌కు మాచుపల్లి గ్రామానికి వెళ్లారన్నారు. ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్ చేసి మరో రోజు వస్తామని తెలిపారన్నారు. దీంతో మల్లు వెంకట సుబ్బారెడ్డి నీకు చేతకాదని విధి నిర్వహణలో ఉన్న తహసీల్దారు మురాద్‌షావలీని పరుష పదజాలంతో దూషించడంతో పాటుగా దాడికి యత్నించాడన్నారు. తహసీల్దారు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకంపై అవగాహన

**పెండ్లిమర్రి, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:**



మండలంలోని వ్యవసాయ కార్యాలయంలో రైతు సేవా కేంద్రం సిబ్బందికి మరియు గ్రామ రెవెన్యూ అధికారులకు ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం ఖరీఫ్-2024 గురించి మండల వ్యవసాయాధికారి జి.పి.ఓబులేసు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకం 2024 కింద వరి, వేరుశనగ, ఉల్లి, పసుపు పంటలకు బీమా వర్తిస్తుందని ఆయన తెలిపారు. ఇంత వరకు పంటలకు కేవైసీ చేసుకోని మిగతా రైతులు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవనాధికారి రెడ్డయ్య మరియు సహాయ గణాంకాధికారి కల్యాణి, రైతు సేవా కేంద్రం సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## ఆలయ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

**పెండ్లిమర్రి, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:**



పెండ్లిమర్రి మండలం వెల్లటూరు చెన్నకేశవ స్వామి ఆలయ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ గుడి ఆవరణలో నిరసన గ్రామస్థులు నిరసన తెలిపారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని పోతు శ్రీనివాసులురెడ్డి, బాల ఓబయ్యలు అన్నారు. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులు విచారించి త్వరితగతిన గుడి భూమిని గుడికి అప్పగించాలని డిమాండ్ చేశారు.

## గంగమ్మకు గాజులతో ప్రత్యేక అలంకరణ

**జమ్మలమడుగు, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:**



మండల పరిధిలోని పెద్దదండ్లూరు గ్రామ సమీపంలోని పెన్నానది ఒడ్డున వెలసిన గంగమ్మకు బుధవారం భాద్రపదం శుద్ధ పౌర్ణమి సందర్భంగా గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామానికి చెందిన జై చంద్ర అమ్మవారి అలంకరణకు 20వేలకు పైగా గాజులు ఉపయోగించి శ్రీచక్ర పూజా సహస్త్ర నామ అభిషేకాలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

# బద్వేలు చెరువులపై హైడ్రా కమిషన్ ఏర్పాటు కావాలి

: చెరువులన్ని ఆక్రమణ : చోద్యం చూస్తున్న నీటిపారుదల శాఖాధికారులు

: చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ సిబ్బంది : చెరువుల చుట్టూ ఆక్రమణ





**బద్వేలు, సెప్టెంబర్ 18 ( ప్రభాతవార్త):**

చెరువులు, కుంటలు ఆక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని సుప్రీంకోర్టు గతంలో ఆదేశించడమే కాకుండా నూతనంగా ఆదేశాలు జారీ చేసినప్పటికీ బద్వేలులో మాత్రం చెరువులన్ని కబ్జాకు గురయ్యాయి. పట్టణ నడిబొడ్డున ఉన్న నాగులచెరువు పూర్తిగా ఆక్రమణకు గురయ్యింది. కొంతమంది చెరువును ఆక్రమించి ఇండ్లు నిర్మించుకోగా మరికొందరు రైస్‌మిల్ ఏర్పాటు చేశారు. ఇంతజరుగుతున్నా నీటి పారుదల శాఖాదికారులు మాకు సంబంధం లేదన్నట్లుగా వ్యవహరించడంతో నాగుల చెరువు పూర్తిగా ఆక్రమణకు గురైంది.హైడ్రా లాంటి కమిషన్ ఏర్పాటై బద్వేలులో ఆక్రమణకు గురైన చెరువులు, కుంటలు స్వాధీనం చేసుకుని ఆక్రమించిన వారిపై కేసులు నమోదు చేయాలని అపుడే బద్వేలులో ఆక్రమణకు గురైన చెరువులకు రక్షణ కలుగుతుందని పలువురు నాయకులు, పెద్దలు అంటున్నారు. నాగులచెరువు చుట్టూ ఉన్న స్థలం విలువ లక్షలలో పలుకుతుండడంతో పది సెంట్లు ఆక్రమించుకున్నా కోటిరూపాయలు విలువ అయ్యే స్థలం అయినందున ప్రతి ఒక్కరూ నాగులచెరువుపై కన్నేశారు. పట్టణానికి నడిబొడ్డున ఉండడమే కాకుండా చుట్టూ నివాసాలు ఏర్పడడంతో కొద్దికొద్దిగా ఆక్రమణలకు గురవుతున్నాయి. నిన్న జరిగిన విపత్తు కారణంగా ఖమ్మం, హైదరాబాద్, విజయవాడ, అతలాకుతలమైన విషయాన్ని గమనించాలి. చెరువులన్ని ఆక్రమించి నివాసాలు ఏర్పాటు చేయడంతో నీరు వెళ్లే మార్గం లేక పట్టణాలు మునిగిపోయే పరిస్థితి ఏర్పడింది. అదే తరహా పరిస్థితి ఏదో ఒకరోజు బద్వేలుకు వచ్చే అవకాశం లేకుండా పోలేదు. ఇంత పెద్ద నాగుల చెరువు పట్టణంలో నడిబొడ్డులో ఉన్న దీనిపై కన్నేస్తే భవిష్యత్తులో విపత్తు ఏర్పడితే పట్టణమంతా మరో ఖమ్మం, విజయవాడలా తయారయ్యే పరిస్థితి ఏర్పడింది. అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదు. రెవెన్యూ భూ బాగంలో ఉన్న రెవెన్యూ అధికారులు కూడా చూసి చూడనట్లు వ్యవహరించడమే కాకుండా ఎవరైనా ఆక్రమిస్తే వారి వద్ద కిందిస్థాయి సిబ్బంది మాముళ్లు తీసుకుని పట్టించుకోకపోవడంతో ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. సుప్రింకోర్టు చెరువులు ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసినా వాటిని అధికారులు తుంగలో తొక్కుతున్నారు. బద్వేలులో నాగులచెరువు, రాచ్చెరువు, బయనపల్లె చెరువు, భాకరాపేట చెరువు,ఇలా పట్టణాన్ని ఆనుకుని ఉన్న అనేక చెరువులు ఆక్రమణకు గురయ్యాయి. పట్టనం రోజురోజుకు విస్తరిస్తుండడంతో స్థలాలను కబ్జా చేయాలనే ఉద్దేశ్యంతో చెరువులు అయితే ఎవరూ పట్టించుకోరని చెరువులపై కన్నేస్తున్నారు. చెరువులు, కుంటలు ఆక్రమిస్తే జరిగే పరిణామాలు కబ్జాదారులకు తెలిసి కూడా అధికారుల నిర్లక్ష్యం కారణంగా కబ్జాలకు ముందుకువస్తున్నారు. ఒక్కరిపై కూడా చర్యలు తీసుకోకపోగా వారికే మద్దతు ఇస్తుండడంతో ఈ ఆక్రమణలను ఆపేవాడే లేకుండా పోయారు. వచ్చిన రెవెన్యూ అధికారులు కూడా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు తప్ప ఒక్క అధికారి అయినా సమగ్ర స్థాయిలో విచారణ జరిపి చెరువు హద్దులను గుర్తించి కాపాడిన దాఖలాలు లేవు. ఇలాగే కొనసాగితే విపత్తులు వచ్చినపుడు ప్రజలు అతలాకుతలమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని, హైడ్రా లాంటి కమిషన్ ఏర్పాటు చేసి కబ్జాలపై దృష్టిపెట్టాలని వారు కోరుతున్నారు.

## పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమం

**పులివెందుల రూరల్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త ః**



పులివెందులలోని ఆహారవిజ్ఞానశాస్త్ర, సాంకేతిక కళాశాలలోని జాతీయ సేవా పథకం విభాగం, చిన్నరంగాపురం ఆరోగ్య విభాగం సంయుక్తంగా బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కుష్టు వ్యాధి నిర్మూలన, టీబీ వ్యాధి నిర్మూలన, పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అసోసియేట్ డీన్ డాక్టర్ జయమ్మ, డాక్టర్ నివేదితలు పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. పొగాకుకు దూరంగా ఉండాలని, పొగాకు తీసుకోవడం వలన కలిగే దుష్పరిణామాల గురించి తెలిపారు. ఉప పారా మెడికల్ అధికారి సి.సుబ్బారెడ్డి కుష్ఠు వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాల గురించి వివరించారు. టీబీ పర్యవేక్షకులు భాగ్యలక్ష్మి మాఆట్లడుతూ టీబీ ఎలా సోకుతుందో విద్యార్థులకు వివరించారు. మందుల కోసం సంప్రదించాలని తెలిపారు. పొగాకు కౌన్సిలరు సుమలత మాట్లాడుతూ పొగ తాగడం వలన వచ్చే దుష్పరిణామాల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు అరుణ, డాక్టర్ రాజేష్, డాక్టర్ కీర్తిరెడ్డి, ఇంజినీరు నజ్మా, డాక్టర్ సాయి శ్రీనివాస్, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ జాకీర్‌బాషా, కె.సుబ్బారెడ్డి, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం ప్రారంభం



**రాయచోటి, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:**

కార్యకర్తల, ఆత్మీయ అభిమానులు మధ్య బుధవారం రాయచోటిలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అన్నమయ్య జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించారు. ఎంపీ మిథున్‌రెడ్డి, వైసీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, అధికార ప్రతినిధి రమేష్‌రెడ్డి, మదనపల్లె ఇన్‌ఛార్జి నిసార్ అహ్మద్ రాయచోటి మున్సిపల్ ఛైర్మన్ ఫయాజ్ బాషా తదితర నేతలు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 2029లో వచ్చేది వైసీపీ అని మళ్లీ జగన్ సీఎం కావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల డిజిటల్ విద్యపై ఐఈఆర్‌పీలకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం




**రాయచోటి, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:**

దివ్యాంగ విద్యార్థినీ విద్యార్థులలో డిజిటల్ విద్యనఉ అందించి వారిలో అభ్యసనా నైపుణ్యాలు ఏ విధంగా పెంపొందించాలి అనే అంశంపై బుధవారం అన్నమయ్య జిల్లాలో స్థానిక కలెక్టర్ వారి కార్యాలయంలో గల కాన్ఫరెన్స్ హాలులో ట్యాబ్‌ల వినియోగంపై సహిత విద్య రిసోర్స్ పర్సన్లకు ఐఈఆర్పీలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి శ్రీయ శివప్రకాష్‌రెడ్డి అధ్యక్షత వహించారు. పరిశీలకులుగా రాష్ట్ర సహిత విద్య సహాయ సమన్వయకర్త డా.ఎన్.అమ్మినాయుడు, డిజిటల్ విద్యను అందించడంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని తెలిపారు. అనంతరం వారు పలు సూచనలు, సలహాలు చేశారు. ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా సమిత విద్య సమన్వయకర్త జనార్దన పర్యవేక్షించగా డిజిటల్ విద్యపై రాష్ట్ర రీసోర్స్ పర్సన్‌గా సునీల్‌కుమార్, మహాలక్ష్మీనారాయుడు వ్యవహరించి ప్రత్యేక ఉపాధ్యాయులకు యాప్‌లపై అవగాహన కల్పించారు.

## కస్తూరాభా బాలికల గురుకుల పాఠశాల సమస్యలను వెంటనే తీర్చాలంటూ అధికారులను ఆదేశించిన అన్నమయ్య జిల్లా కలెక్టర్



**వీరబల్లి,సెప్టంబర్18,ప్రభాతవవార్త :**

మండల కేంద్రంలో ఉన్న కస్తూరిభా బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం సాయంకాలం 7గంటల సమయంలో పాఠశాలను అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంమలో భాగంగా ఆయన అక్కడ చదువుతున్న విద్యార్థినీలతో సమావేశమై వివిధ సమస్యలపై ఆరా తీశారు. పాఠశాలకు ప్రహరీ గోడ లేదని నీటి సమస్య ఎక్కువగా ఉందని విద్యుత్ లైట్లు లేవని టాయిలెట్లు సమస్యలు ఉన్నాయని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పంధించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడుతూ పాఠశాలకు ఉన్న సమస్యలను వెంటనే తీర్చాలని అధికానులకు ఆదేశించారు. ఆయన పిల్లలతో కలసి బోంచేశారు. పిల్లలకు ఇంకా రుచిగా చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముందుగా ఆయన మండలంలోని తాహశీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అక్కడ ఫ్రీ హోల్డ్ కు సంబంధించి రికార్డులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమమంలో ఎంపీడీఓ రామచంద్రా రెడ్డి తాహశీల్దార్ శ్రావణి, మండల విద్యాశాఖాధికారి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



## వైసీపీ పాలనలో రాష్ట్రషం 30 ఏళ్లు వెనక్కి

**రాయచోటి, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రజలు ఛీ కొట్టడంతో అధికారం కోల్పోయిన వైసీపీ నేతలు పిచ్చి పట్టి మాట్లాడుతున్నారన్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా మండిపడ్డారు. బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి వెళ్లిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలు పిచ్చి పాలన చూసి తట్టుకోలేక, వారి అరాచకాలు, జీర్ణించుకోలేక 151 సీట్ల నుంచి 11కు పరిమితం చేశారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా వైసీపీ నేతలు పిచ్చి మాటలు మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు వెంకట రామిరెడ్డి, జయరామిరెడ్డి, మట్లి శ్రీనివాసులు నాయుడు, జయరామిరెడ్డి, మట్లి శ్రీనివాసులు నాయుడు, శివారెడ్డి, సంజీవరెడ్డి, జాఫర్ అలీఖాన్, రామరాజు, విష్ణువర్ధన్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, ఎన్నారై నరసింహనాయుడు, ప్రొఫెసనల్ వింగ్ ప్రెసిడెంట్ హరి యాదవ్, ఇర్ఫాన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



## రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతానికి చర్యలు

### ప్రకృతి వ్యవసాయాన్ని పెంపొందించుకోవాలి

### జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్



**మదనపల్లె, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త :**
రైతు ఉత్పత్తిదారుల సంఘాలను(ఎఫ్‌పిఓ)లను బలోపేతం చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. గురువారం పట్టణంలోని సిఎల్ఆర్‌సి భవన్‌లో ఏపి మాస్ సిఈఓ సిఎస్.రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఎం-టమోటా వ్యవసాయ ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ 6వ వార్షికోత్సవ మహాసభలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం వద్ద నున్న వనరులన్నీ ఎవరైతే సమర్థవంతంగా వినియోగించుకొని వాటిని వృధా చేయకుండా ఉపయోగించుకోగలుగుతారో అలాంటి వారికి ప్రభుత్వం సాయం చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. 2047కు రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్‌గా ఉంచేందుకు ముఖ్యమంత్రి ఓ విజన్‌తో ముందుకు వెలుతున్నారన్నారు. అన్నమయ్యజిల్లాలో వర్షాభావ ప్రాంతంతో నీటి కొరత అధికంగా ఉందని దానిని అధిగమించడానికి మావద్ద వనరులు ఉన్నాయన్నారు. చదువుకున్న యువతకు నైపుణ్యాతాభివృద్ధి శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించాలని ప్రభుత్వం ఆలోచిస్తొందన్నారు. టమోటాకు మదనపల్లె ప్రసిద్ధి చెందిందని దేశంలోనే చెప్పుకోదగ్గ మార్కెట్ ఇక్కడ ఉందన్నారు. మార్కెటింగ్ విధానాన్ని కూడా రైల్వేస్‌తో ఒక ఎంఓయు తీసుకుంటే ఉత్పత్తి నేరుగా ఢిల్లీ మార్కెట్‌కు పంపవచ్చునన్నారు. మార్కెటింగ్ విధానంపై రైతులకు అవగాహన ఉండాలన్నారు. విత్తనాల ఉత్పత్తి, లైసెన్స్ విధానంలో జాగ్రత్త వహించాలన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. అధిక దిగుబడులు ఇచ్చే పంటలను పండిస్తే రైతులు ముందుకు వెలుతారన్నారు. అనంతరం ఎన్ఐఆర్‌డి మాజీ డిజిడబ్ల్యు ఆర్.రెడ్డి మాట్లాడుతూ రైతులందరిలో ఈ సంస్థ నాది అన్న మనోభావం వస్తే ఎం-టమోటా వ్యవసాయ ఉత్పత్తిదారుల కంపెనీ కార్పోరేట్ సంస్థగా ఎదిగే అవకాశం ఉందన్నారు. వ్యవసాయ ఉద్యానవన పశుసంవర్ధక సంస్థలు ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ సంబంధిత శాఖల అధికారులు అందరూ ఎఫ్‌పిఓలతో సన్నిహిత్యాన్ని పెంపొందించుకునేలా నిర్వాహక సంస్థలతో ఎప్పటికప్పుడు సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈసమావేశంలో మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ మాట్లాడుతూ ఎఫ్‌బిఓలకు అన్ని విధాల కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. రైతు సభ్యుల తమ అభిప్రాయాలు, సూచనలు సమావేశంలో వివరించారు. అనంతరం ఏపి మాస్ రాయలసీమ వాటర్ ఇనిసియేటీవ్ ప్రచార కరపత్రాలను సభ్యులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు.

## యర్రగుంట్ల పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



**యర్రగుంట్ల, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త:**
పట్టణ పరిధిలోని పోలీస్‌స్టేషన్‌ను బుధవారం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను, రిసెప్షన్, లాకప్, టెక్నికల్ రూమ్ పరిసరాలను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి వారి విధులకు సంబంధించిన సూచనలను చేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీఐ నరేష్ బాబుకు పలు సూచనలు చేశారు. క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. శాంతి భద్రతలను ఎల్లప్పుడు అదుపులో ఉంచుకునేందుకు చర్యలు తీసుకోవాలని, పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులను ఎల్లవేళలా స్వీకరఇంచడం బాధితుల ఫిర్యాదుపై సత్వరం స్పందించి సేవలందించాలని చెప్పారు. అసాంఘీక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. ఆయన వెంట సీఐ నరేష్ బాబు, ఎస్ఐ విష్ణు నారాయణ, సిబ్బంది ఉన్నారు.

## పంట కోత ప్రయోగాల పైన రైతు సేవా కేంద్ర సిబ్బందికి శిక్షణా కార్యక్రమం



**ముద్దనూరు, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త:**
ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకంకు సంబంధించి ఆర్.యస్.కె సిబ్బందికి శిక్షణా కార్యక్రమము బుధవారం నాడు మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక ఏడీఏ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా అమలు చేసే పంట కోత ప్రయోగాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించి సిబ్బంది పనిచేయాలని కోరారు. పంట నమోదు మరియు ఈకేవైసి 100శాతం పూర్తి చేయాలని కోరారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారులు ఇచ్చిన విధి విధానాల ప్రకారం పంట కోత ప్రయోగాల ప్లాట్స్‌ను ఎంపిక చేయాలని కోరారు. పంట కోత ప్రయోగాలను రైతుల సమక్షంలో నిర్వహించి దిగుబడులను అంచనా వేయాలని సిబ్బందికి సూచించారు. నిర్దేశించిన సమయంలో పంట కోత ప్రయోగాలకు సంబంధించి పర్యవేక్షణ అధికారులకు సమాచారం అందించి పంట కోత ప్రయోగాల్లో పాల్గొనేలా చూడాలని సిబ్బందికి తెలిపారు. అలాగే రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించి 100శాతం పంట నమోదు చేయాలని మరియు 100శాతం ఈకేవైసీ చేయాలసి సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల గణాంక అధికారి నవతేజ మరియు ఆర్‌యస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

## దళితులు, గిరిజనులను మిగులు భూములు పంచకపోతే భూ పోరాటం



**రాజంపేట అర్బన్, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త:**
నిరుపేద దళిత గిరిజనులకు ప్రభుత్వ మిగులు భూములు పంచడంలో ప్రభుత్వాలు, రెవెన్యూ అధికారులు విఫలం అయ్యారని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ ధ్వజమెత్తారు. ఆంధ్రప్రదేష్ వ్యవసాయ కార్మిక సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షులు పందుగోల మణి ఆధ్వర్యంలో స్థానిక రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. వ్యవసాయ కూలీలు, దళిత, గిరిజన కూలీలతో ప్రతి కుటుంబానికి మూడు ఎకరాలు ప్రభుత్వ భూమి ఇచ్చి, పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు పరిష్కరించాలని అర్హులైన దళిత, గిరిజనులకు ప్రభుత్వ అసైన్‌మెంట్ బంజరు భూములు, గయ్యాలి అటవి బంజరు భూములు వ్యవసాయ కూలీలకు పంచాలని డిమాండ్ చేస్తూ రాజంపేట పట్టణంలో ఎర్రజెండాలు చేత బట్టి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఆంధ్రప్రదేష్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తోపు కృష్ణప్ప మాట్లాడుతూ చిట్వేలు మండలం చెర్లోపల్లి, కోడూరు మండలం సంతానగర్, ఓబులవారిపల్లి మండలం బాలిరెడ్డిపల్లి, మంగళపల్లి ఎస్టి కాలనీ, చిన్నంపల్లి ఎస్టి కాలనీ, గోవిందపల్లి, కొర్లకుంట హరిజనవాడ, అరుంధతి వాడల్లో నెలకొన్న భూ సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం రాజంపేట సబ్ కలెక్టర్ నైదియా దేవి సమస్యలపై సానుకూలంగా స్పందిస్తూ త్వరలో ఆయా మండలాలలో పర్యటించి ఆయా భూ సమస్యలు పరిష్కరం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెనగలూరు మండల కార్యదర్శి రేవూరి కృష్ణయ్య, గుడిసె జయరామయ్య, వ్యవసాయ కార్మిక సంఘం కోడూరు నియోజకవర్గ నాయకులు తిప్పన ప్రసాద్, సీపీఐ కోడూరు మండల కార్యదర్శి రాజశేఖర్, సామా గంగయ్య, మొగిలి వినయ్, శెట్టిపల్లి నర్సయ్య, బుజ్జక్క, ఓబులవారి మండల కార్యదర్శి రమణయ్య, సహాయ కార్యదర్శి చెంచురామయ్య తదితరులు పాల్గొన్నారు.

## సీఎంను కలిసిన బాలసుబ్రమణ్యం



**రాజంపేట అర్బన్, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త:**
రాజంపేట నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నేత సుగవాసి బాల సుబ్రమణ్యం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిశారు. నియోజకవర్గాల సమావేశం అనంతరం చంద్రబాబును కలిసి పార్టీ పరిస్థితులు, పలు సమస్యలు, అభివృద్ధిపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఎన్నికల సంధర్భంగా చోటు చేసుకున్న పలు పరిణామాలు పూర్తిగా వివరించినట్లు సమాచారం. స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని విశయాలు తనకు తెలుసునని స్పష్టం చేశారు. ప్రభుత్వ కార్యక్రమాలె ప్రజల్లోకి తీసుకువెళ్లాలని దిశా నిర్దేశం చేశారు.

## చల్లా రాజన్న ఆధ్వర్యంలో పౌర్ణమి సంధర్భంగా అన్నదానం

**ప్రొద్దుటూరు, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త:**
ప్రొద్దుటూరు టీడీపీ బీసీ నాయకులు చల్లా రాజగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో పౌర్ణమి సంధర్భంగా స్థానిక టూ టౌన్ బైపాస్‌లో వెలిసిన పెద్దమ్మ చిన్నమ్మ తల్లి దేవాలయం ఆవరణంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రొద్దుటూరు పట్టణంలో గత రెండు సంవత్సరాలుగా ప్రతి శనివారం మరియు ప్రతి పౌర్ణమికి చల్లా రాజగోపాల్ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో సుమారు 300మంది పాల్గొని సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చల్లా రవిశంకర్ యాదవ్, మూరబోయిన శ్రీనివాస యాదవ్, నల్లం రవిశంకర్, సీతంపల్లి రమణ, ప్రసాద్, బంగి శివ, యేసునాథ రెడ్డి, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.



## ప్రొద్దుటూరులో బీజేపి సభ్యత్వ నమోదు



**ప్రొద్దుటూరు, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త:**
భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధవారం స్థానిక ఆంధ్రకేసరి రోడ్డులోని రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ నందు పట్టణ అధ్యక్షులు వంకధార నరేంద్ర రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని, నరేంద్ర మోడి యొక్క పాలనాదక్షతకు, పథకాలకు ఆకర్శితులైన ప్రజలు స్వచ్ఛందంగా సభ్యత్వ నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపి ప్రధాన కార్యదర్శులు చలపతి రావు, పరమేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు చిన్న, ఎస్టీ మోర్చా పట్టణ అధ్యక్షులు రమణయ్య, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు రవితేజ, సురసుర సాలన్న మరియు బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అక్రమంగా మద్యం అమ్మితే చర్యలు



**ఖాజీపేట, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త:**
గ్రామాల్లో అనుమతులు లేకుండా అక్రమ మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఖాజీపేట సీఐ మోహన్ హెచ్చరించారు. ఖాజీపేట మండలం దుంపలగట్టు టోల్ ప్లాజా వద్ద చిల్లర అంగళ్లను తనిఖీ చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా మద్యం అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు. దుకాణాదారుల యజమానులను పిలిపించి బుధవారం సాయంత్రం ఖాజీపేట సీఐ మోహన్ కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఖాజీపేట సీఐ మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆదేశాలతో వరద ప్రభావిత గ్రామాల్లో సబ్ కలెక్టర్ పర్యటన



**రాజంపేట అర్బన్, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త:**
మూడేళ్ల క్రితం అన్నమయ్య ప్రాజెక్ట్ కొట్టుకుపోవడంతో సర్వం కోల్పోయిన వరద ప్రభావిత గ్రామాల్లో పర్యటించి ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియా దేవి బుధవారం పర్యటించారు. ఇటీవల ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాన్ వరద ప్రబావిత గ్రామాల్లో పర్యటించిన విశయం తెలిసిందే. ఈ సంధఋంగా రైతులు, ప్రజలు, వివిధ వర్గాల వారు వరదలతో తాము తీవ్రంగా నష్టపోయామని నామమాత్రంగా సహాయం అందిందని వివరించారు. దీనిపై స్పందించిన ఉప ముఖ్యమంత్రి ప్రజల కష్టాలు, కన్నీల్లు తుడిచేందుకు అధికారులను పంపుతామని హామీ ఇచ్చారు. ఈ మేరకు ప్రభుత్వం వరద ప్రభావిత గ్రామాల్లో పర్యటించి నివేదికను సిద్ధం చేయాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు సబ్ కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో కలిసి కులపత్తూరు, మందపల్లె, రాంచంద్రాపురం గ్రామాల్లో పర్యటించారు. రైతులు, మహిళలు పెద్దఎత్తున సమస్యలు వివరించారు. అధికారులు వరద విలయంపై గూగుల్ మ్యాప్‌ను కూడ సబ్ కలెక్టర్‌కు చూపించారు. వరద పరిస్థితిని వివరించారు. ఆయా శాఖల ద్వారా అందిన సహాయం ప్రజలు కోరుతున్న సహాయం గురించి వివరించారు. పూర్తి స్థాయిలో నివేదిక సిద్ధం చేయనున్నట్లు తెలుస్తుంది. నేడు నందలూరు మండలం పాటూరు, నాగిరెడ్డి పల్లె గ్రామాల్లో సబ్ కలెక్టర్ పర్యటిస్తారని అధికారిక వర్గాలు తెలిపాయి.

## పురుగు మందుల విక్రయాల్లో నిబంధనలు పాటించాలి



**దువ్వూరు, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త:**
మండల పరిధిలో పురుగుమందులు విక్రయించే దుకాణాదారులు వ్యవసాయ శాఖ రూపొందించిన నిబంధనలుఖచ్చితంగా పాటించాలని, లేనిచో చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి అమర్‌నాథ్ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కానగూడూరు గ్రామంలో ఉన్న పురుగుమందులు, రసాయనిక ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సంధర్భంగా ఆయన పలు రకాల మందులు, ఎరువులకు సంబంధించి నమూనాలను స్వీకరించి ల్యాబ్‌కు పంపుతున్నట్లు తెలిపారు. పురుగు మందుల దుకాణాదారులు తమ లైసెన్స్‌లో పేర్కొన్న మందులనే విక్రయించాలని, బయో మందులు విక్రయించరాదన్నారు. అలాగే మండలంలో కొద్ది మేర యూరియ కొరత ఉందని దానిని సాకుగా తీసుకొని ధరలుపెంచితే దాడులు చేసి లైసెన్స్‌లు రద్దు చేస్తామన్నారు. ఖచ్చితంగా నిబంధనల ప్రకారం ఎరువులు, పురుగుమందులు విక్రయించాలని ఆదేశించారు.

## దువ్వూరుకు కార్యదర్శిని నియమించండి

**దువ్వూరు, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన దువ్వూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి సెలవుపై వెళ్లి 10 రోజులు అయింది. ఇంతవరకు ఇంచార్జ్ కార్యదర్శి లేకపోవడంతో దువ్వూరు గ్రామ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గ్రామ పంచాయతీ ద్వారా జనణ మరిణ ధృవీకరణ పత్రాలు, ఇంటి, నీటి పన్ను చెల్లింపుల కొరకు ప్రజలు పంచాయతీ కార్యలయానికి వస్తున్నారు. కార్యదర్శి సెలవు పెట్టి 10రోజులు అయింది. ఇంతవరకు ఇంచార్జ్ కార్యదర్శిని కూడ నియమించలేదు. కార్యదర్శి తన సెలవును 10రోజులు పొడిగించారని సమాచారం. అయితే జిల్లా అధికారులు చర్యలు తీసుకొని ఇంచార్జ్‌గా పంచాయతీ కార్యదర్శిణి నియమించాలని దువ్వూరు ప్రజలు కోరుతున్నారు.

## 20న ఎస్‌జీఎఫ్ క్రీడా ఎంపికలు

**దువ్వూరు, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని చల్లబసాయి పల్లె జిల్లా పరిషత్ హైస్కూల్ నందు ఈ నెల 20, 21వ తేదీలలో ఎస్‌జీఎఫ్ క్రీడా ఎంపికలు నిర్వహిస్తున్నట్లు మండల కోఆర్డినేటర్ ప్రతాప్ తెలిపారు. 2024-25వ సంవత్సరానికి గాను ఈ ఎంపికలు జరుగుతున్నాయని మండలంలో 14సంవత్సరాల లోపు, అలాగే 27 సంవత్సరాల లోపు బాల బాలికలకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 20వ తేదిన కబడ్డీ, కో కో, షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, యోగా, చెస్ పోటీలు జరుగుతాయని, అలాగే 21వ తేదిన అథ్లెటిక్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

## 23లోగా రైతులు పంటనమోదు చేసుకోండి



**తంబళ్లపల్లె, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:**
తంబళ్లపల్లె మండలంలోని రైతులు ఖరీఫ్ సీజన్‌లో తాము సాగు చేసిన పంటల వివరాలను ఈనెల 23వ తేదీ లోగా పంట నమోదు చేసుకోవాలని అన్నమయ్య జిల్లా వ్యవసాయాధికారి చంద్ర నాయక్ తెలిపారు. బుధవారం ఆయన మదనపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు శివశంకర్, మండల వ్యవసాయాధికారి రమణకుమార్‌లతో కలిసి మండలంలోని పరసతోపు పంచాయతీ పరిధి రైతు సేవా కేంద్రం పరిధిలోని పొలంబడి కార్యక్రమంలో భాగంగా వేరుశనగ పంట సాగును పరిశీలించారు. ఖరీఫ్ వేరుశనగ పంటలో అధిక దిగుబడి, నాణ్యమైన కాయలు పండించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. వర్షాధారిత పంటలలో ంరైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలను విశదీకరించారు. అదే విధంగా ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు ఈనెల 23వ తేదీ లోపు కేవైసీ తప్పక చేయించుకోవాలని లేదంటే ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు, రాయితీలు వచ్చే అవకాశం ఉండదని హెచ్చరించి. వారి వెంట ఏఈఓలు అంబేద్కర్, సురేష్, మల్లీశ్వరి, వేమ నారాయణ, రైతులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యం, పర్యావరణానికి పెద్దపీట వేయండి



**తంబళ్లపల్లె, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:**
తంబళ్లపల్లె మండలంలో వైద్య సిబ్బంది, అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు, ఉపాధి సిబ్బంది, మహిళా సంఘాలు విద్యార్థులు పారిశుద్ధ్యంతో పాటు పర్యావరణానికి పెద్దపీట వేయాలని మండల ప్రత్యేక అధికారి నాగరాజు పిలుపుని చ్చారు. బుధవారం ఆయన స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో సురేంద్రనాథ్, ఈ ఓఆర్డీ దిలీప్‌కుమార్ నాయక్‌లతో కలిసి జూనియర్ కళాశాల, హౌసింగ్ లేఅవుట్ల వద్ద మురికినీటి కాలువలు శుభ్ర త, దోమల నివారణపై అవగాహన తదితర సూచనలు, సలహాలు చేశారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అశోక్, సుజాత, వివేకానంద, పద్మావతి, భాస్కర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## గంజాయి ప్రాంతాల తనిఖీ



**బ్రహ్మంగారిమఠం, సెప్టెంబర్ 18 ( ప్రభాతవార్త):**
బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని పోలేరమ్మనగర్, కాశినాయన గుడి, కక్కయ్య మఠం ప్రాంతాలలో గంజాయి ఎక్కువగా సేవిస్తారని, అలాగే అమ్మకాలు జరుగుతాయని, జిల్లా ఎస్పీఆదేశాల మేరకు జిల్లా నార్కోటిక్స్ కంట్రోల్ సెల్ సీఐ కె. రమణారెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టడం జరిగింది. గంజాయికి యువత ఎక్కువగా బానిసలై చెడుదారి పడుతున్నారని, అసాంఘీక కార్యక్రమాలు చేపట్టే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున ఈ ప్రాంతాలను తనిఖీ చేస్తున్నామని, ఎవరైనా బ్రహ్మంగారిమఠంలో గంజాయి అమ్మేవారు ఉండి, వారి వివరాలు తెలియజేస్తే విక్రయించేవారిపై దాడిచేసి, వివరాలు చెప్పిన వారిపేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రతి ఒక్కరూ చెడు కార్యక్రమాలు జరిగితే సమాచారం అందించాల్సిన బాద్యత ప్రతిపౌరుడిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నార్కోటిక్ కంట్రోల్‌సెల్ ఎస్ఐ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



**గాలివీడు, సెప్టెంబర్ 18(ప్రభాతవార్త):**
క్రీడల ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు క్రీడల్లో ప్రతిభ చూపడం ద్వారా ఉజ్వల భవిష్యత్తును సొంతం చేసుకోవచ్చని ఎంపీడీఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రీడలపై మక్కువ పెంచుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని సూ చించారు. విద్యార్థులు ఎంచుకున్న క్రీడల్లో వారికి శిక్షణ ఇచ్చి ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని వ్యాయామ ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం 2కె రన్ స్ట్రైకింగ్ నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ శేఖర్‌నాయక్, ప్రధానోపాధ్యాయులు మొహిద్దీన్, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## 2కె, 5కె పరుగు పందెంలో మండల ప్రజలు



**వీరబల్లి, సెప్టంబర్18, ప్రభాతవవార్త :**
స్వచ్ఛతా సేవా కార్యక్రమంమలో భాగంగా మండలంలో ఎంపీడీఓ రామచంద్రారెడ్డి, ఆధ్వర్యంలో బుధవారం 2కె,5కె పరుగు పందెంలో భాగంగా గ్రామ ప్రజలు మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులు కలసి రెండు కిలోమీటర్లు, ఐదు కిలోమీటర్ల పరుగులలో పాల్గొని విజయవంతంగా పూర్తి చేయడం జరిగింది. అదే విధంగా సఫాయి మిత్ర, సురక్షా కార్యక్రమమునందు హెల్త్ చెకప్ ను సూపించడం జరిగింది. అదేవిధంగా గ్రామంలో ఉండే రోడ్లకు ఇరువైపులా మరియు గ్రామంలోని రహదారులలో ఉండే గుంతలను పూడ్చడం జరిగింది. అంతేగాకుండా నీటి కుంటలలో నిల్వ ఉన్న నిటిలో ఆయిల్ ను చల్లి లార్వాను నాశనం చేయడం జరిగింది. దోమల నియంత్రణ కోసం బ్లీచింగ్ కూడా చల్లడం జరగింది. ఈ కార్యక్రమమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డివియస్ సత్యకుమార్, ఏపీఓ నాగరాజు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్లు,, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సైన్స్ సంబరాలను విజయవంతం చేయండి



**వీరబల్లి, సెప్టంబర్18, ప్రభాతవవార్త :**
సృజనాత్మక వివేచనాత్మక ఆలోచనలను పెంపొందించి విద్యార్థులలో వైవిధ్యంగా ఆలోచించే దృక్పధాన్ని వెలికి తీసే చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టులను రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి పాఠశాలలోనూ సెప్టంబర్ 25వ తేదీన నిర్వహించాలని అన్నమయ్య జిల్లా అసోసియేట్ సైన్స్ అఫీసర్ పల్లం రామచంద్ర తెలియజేశారు. ఈ సందర్బంగా ఆయన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉప్పరపల్లెలో చెకుముకి సైన్స్ సంభరాలకు సంబంధించిన పోస్టర్‌ను ప్రధానోపాధ్యాయులు చంద్ర శేఖర్ మరియు ఇతర సైన్స్ ఉపాధ్యాయులతో కలసి విడుదల చేశారు. సమకాలని సమాజంలో జరిగే వివిధ సంఘటనలను విజ్ఞాన శాస్త్ర ఆవిష్కరణలను ప్రస్తావిస్తూ కొనసాగే సైన్స్ టాలెంట్ టెస్టులను ఉపాధ్యాయులందరూ విద్యార్థులకు పరిచనం చేసి వారు ఈ పరీక్షల్లో పాల్గొనేటట్టుగా చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమమంలో జన విజ్ఞాన వేధిక నాయకులు మధుసూధన రాజు, శివారెడ్డి, మధు సూధన రెడ్డి, వెంకటేశ్వర్లు, నాగేశ్వరి, గైబుసాహెబ్, రవిచంద్రశేఖర్ రెడ్డి, రమణ, ఓబులేసు, నాగరత్న, తదితరులు పాల్గొన్నారు.

## నేడు మండలానికి సబ్ కలెక్టర్ నైదియా దేవి రాక



**నందలూరు, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త:**
నవంబర్ 2021 సంవత్సరంలో వచ్చిన వరదల వల్ల అన్నమయ్య డ్యాం తెగిపోవడంతో జరిగిన ఆస్తి,ప్రాణ నష్టాలు అంచనా వేయడానికి రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియా దేవి నందలూరు మండల పర్యటనకు గురువారం వస్తారని మండల ఎంపిడిఓ సౌభాగ్యం తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా పాటూరు పంచాయతీ నందు కొత్త సచివాలయం, నాగిరెడ్డిపల్లిలో షాది ఖానా నందు,అరవపల్లిలో షాదిఖానా, లేభాకలో సచివాలయం నందు ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలోని ప్రజలను కలిసి వారి నుండి అర్జీలను స్వీకరిస్తారు అని తెలిపారు. వరదల వల్ల నష్టపోయిన ప్రజలు పైన తెలిపిన గ్రామాలలో వరదల వల్ల నష్టపోయిన బాధితులు నష్టపరిహారం అందని వారు వినతి ఇవ్వాలని ఎంపిడిఓ తెలిపారు.


వార్త



రిపోర్టర్స్ కావలెను

తెలుగు దిన పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న వార్త దిన పత్రిక నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

కావలసిన సెంటర్లు

| అన్నమయ్య జిల్లా | కడప జిల్లా |
| --- | --- |
| సుండుపల్లె, వాయల్పాడు, కలకడ, మొలకలచెరువు, గుర్రంకొండ, బి.కొత్తకోట, పీలేరు రూరల్, మదనపల్లె రూరల్ | వల్లూరు, మైలవరం, కమలాపురం, సికెదిన్నె, బద్వేలు రూరల్, కలసపాడు, పోరుమామిళ్ల, బి.కోడూరు |

మీ పూర్తి బయోడేటాతో 20వ తేది శుక్రవారం క్రింది చిరునామాలో సంప్రదించగలరు

వార్త కార్యాలయం, డోర్ నెం. 1-2237, హౌసింగ్ బోర్డు కాలని, విశ్వేశ్వరయ్య సర్కిల్ దగ్గర, రైల్వేస్టేషన్ రోడ్డు, కడప.
సెల్ నెం. 9848787289, 8919566086